సాక్షి చిత్తూరు

శనివారం । 16 । సెప్టెంబర్ । 2023



అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయం

అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పాలన సాగుతోందని మంత్రులు నారాయణస్వామి, పెద్దిరెడ్డి తెలిపారు. - IIలో



ఘనంగా ఇంజనీర్స్ డే

చిత్తూరులో శుక్రవారం పలుచోట్ల ఇంజనీర్స్ డేని ఘనంగా నిర్వహించారు. - IIలో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	34	24
తిరుపతి	36	26
తిరుమల	30	21
గూడూరు	38	27
నగరి	35	25

న్యూస్‌రీల్

పొలెంలోనే ఏనుగుల మకాం



ధ్వంసమైన కూరగాయల పంట

పులిచెర్ల(కల్లూరు): మండలంలో అటవీ సమీప పొలెం పంచాయతీని ఏనుగులు వీడడం లేదు. మూడో రోజు గురువారం రాత్రి కూడా పంట పొలాల్లో చొరబడి విధ్వంసం సృష్టించాయి. జూపల్లెకు చెందిన రైతు సుబ్రమణ్యం మామిడి తోపులో కొమ్మలను విరిచి వేశాయి. కూరగాయల పంటను తొక్కివేసి, వాటర్ పైపులను ధ్వంసం చేశాయి. రైతులు పొలాల వద్దకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు.

గంగమ్మా రక్షమాం



విశేషాలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో భాద్రపద మాసం తొలి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నిత్యకైంకర్యాలను నిర్వహించారు. రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల మధ్య విశేష అభిషేక పూజలు నిర్వహించారు. పట్టుపీతాంబరాలు, స్వర్ణాభరణాలు, పరిమళభరిత పుష్ప మాలికలతో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను అందజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం



చిత్తూరు మండలం పెరుమాళ్లకండ్రిగలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి

చిత్తూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రారంభమైంది. వలంటీర్లు ఇంటింటా మొదటి విడత సర్వేను ప్రారంభించారు. ప్రతి గడపకు వెళ్లి పలు ప్రశ్నలను అడిగి ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద లబ్ధి, ఆరోగ్య శ్రీపై అవగాహన, ఆరోగ్య సేవల లబ్ధి, ఆరోగ్య కేంద్ర వివరాలను సేకరించి యాప్‌లో పొందుపరిచారు. అనంతరం స్మార్ట్ ఫోన్ ఉన్నవారికి ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాలను అందించారు. జిల్లా, మండల స్థాయి అధికారులు సర్వేను తీరును పరిశీలించారు. తొలిరోజు 895 మంది వలంటీర్లు 20,354 కుటుంబాలను సర్వే చేసినట్లు డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి దేవి పేర్కొన్నారు.

నేడు మట్టి గణపతులపై అవగాహన

చిత్తూరు కలెక్టరేట్ : పర్యావరణ పరిరక్షణలో భాగంగా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో శని వినాయక ప్రతిమల ప్రోత్సాహక అవగాహన కార్యక్రమం నిర్వహించాలని డీఈవో విజయేంద్రరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలల్లో చదువుతున్న పిల్లలతో మట్టి వినాయకులను చేయించి ప్రదర్శించాలన్నారు. మట్టి వినాయకుడిని తయారు చేయడం, సహజ రంగుల వినియోగంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పాఠశాలల్లోని ఐఎఫ్‌పీల ద్వారా మట్టివినాయకుల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయాలన్నారు.

నేడు 4వ విడత వైఎస్సార్ కాపు నేస్తం

జిల్లాలో 7,091 మందికి లబ్ధి



కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఈనెల 16న వైఎస్సార్ కాపునేస్తం 4వ విడత జిల్లా స్థాయి కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో సీఎం పథకాన్ని రాష్ట్ర స్థాయిలో ప్రారంభిస్తారన్నారు. జిల్లా స్థాయి కార్యక్రమం కలెక్టరేట్‌లో జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 45 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న బలిజ, ఒంటరి, తెలగ మహిళలకు ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 వేలను ప్రభుత్వం జమచేస్తుందన్నారు. జిల్లాలో నాల్గవ విడత పథకానికి 7091 మందికి రూ.10.636 కోట్లు లబ్ధిని ప్రభుత్వం చేకూరుస్తున్నట్లు తెలిపారు.

తాగునీటికి అధిక ప్రాధాన్యం

'జిల్లాలో తాగునీటి అవసరాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం.. కుప్పం నియోజకవర్గానికి హంద్రీ–నీవా నీటిని తీసుకురావడమే లక్ష్యం .. హంద్రీ నీవాతో కుప్పం నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది..' అని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, రాష్ట్ర అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధ్యక్షతన జరిగిన ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో తాగునీటి సమస్యలకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.

మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, వేదికపై డిప్యూటీ సీఎం నారాయణస్వామి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్



- కుప్పంకు హంద్రీ–నీవా నీటిని తీసుకురావడమే లక్ష్యం
- కైగల్ నదిపై రూ. 20.50 కోట్లతో రిజర్వాయర్
- పాలారువద్ద చెక్ డ్యామ్‌ల నిర్మాణం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- ఇరిగేషన్, వ్యవసాయ సలహా మండలి జిల్లా సమావేశం

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలో తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు ముమ్మరంగా చేపడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. జెడ్పీ సమావేశ భవనంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం అందించడంలో భాగంగా హంద్రీ–నీవా కాలువ పనులను పూర్తి చేసి త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. హంద్రీ–నీవా కాలువ ద్వారా దాదాపు వంద చెరువులను నింపుతూ కుప్పం నియోజకవర్గంలో నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశం ద్వారా అందిన మైనర్, మీడియం ఇరిగేషన్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బైరెడ్డిపల్లె, వి.కోట మండలాలకు తాగునీరు అందించడంలో భాగంగా కైగల్ నదిపై రిజర్వాయర్ నిర్మించేందుకు రూ. 20.50 కోట్లకు, కుప్పం నియోజకవర్గ పరిధిలోని పాలారు నది వద్ద చెక్ డ్యామ్‌లు నిర్మించేందుకు నివేదికలు పంపినట్లు వెల్లడించారు. పలమనేరుకు తాగునీటిని అందించేందుకు గంగమ్మ శిరస్సు వంకపై రిజర్వాయర్ నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పూతలపట్టు మండలం చామంతిపురం వద్ద వైఎస్సార్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఏర్పాటుకు అంచనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ నుంచి గ్రావిటీతో యమనూరు వద్ద ఉన్న టీఎంసీ సామర్థ్యం రిజర్వాయర్‌కు నీటిని అందించేందుకు ప్రతిపాదనలను పంపినట్లు తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ

జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాలు, పర్యావరణలో భాగంగా మట్టి వినాయకులను పూజించే అవగాహన పోస్టర్లను మంత్రులు ఆవిష్కరించారు. కారుణ్య నియామకాల్లో భాగంగా 31 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంఎల్‌సీ భరత్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రతి పంట ఈ– క్రాప్ నమోదు

జిల్లాలో సాగైన ప్రతి పంటను ఈ–క్రాప్ నమోదు చేపట్టాలని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. మామిడి రైతులకు అవసరమైన ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ ఖరీఫ్‌లో అత్యధికంగా 16,091 హెక్టార్లలో వేరుశనగను సాగులో ఉన్నట్లు చెప్పారు. మామిడి రైతులకు పూత, పిందె దశల్లో తీసుకోవాల్సిన చర్యలపై కూడా శాస్త్రవేత్తలతో అవగాహన కల్పిస్తామని తెలిపారు. జిల్లాలో 6 నియోజకవర్గాల పరిధిలో అగ్రి ల్యాబ్‌లు మంజూరుకాగా, నగరి, పలమనేరులో ప్రారంభమయ్యాయని రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.

ప్రాజెక్టుల ద్వారా సాగు, తాగునీటి సరఫరా

ప్రాజెక్టుల ద్వారా సాగు, తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. జిల్లాలో జూలై , ఆగస్టు నెలల్లో ఆశించిన మేర వర్షాలు పడలేదన్నారు. తాగునీటికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కృష్ణాపురం ప్రాజెక్టు ద్వారా 6,125 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని తెలిపారు. ఈ రబీకి 4,125 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని నిర్ణయించి, ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు.కలవకుంట జలాశయం ద్వారా చిత్తూరు పట్టణానికి తాగునీరు అందిస్తున్నామన్నారు. జిల్లాలోని 4,125 చిన్ననీటి పారుదల ప్రాజెక్టుల ద్వారా 1,12,996 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని తెలిపారు. ఏపీఐఎల్‌ఐపీ రూ. 49 కోట్లతో 6 పనులకు పరిపాలనా ఉత్తర్వులు మంజూరు కాగా అందులో 5 పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయన్నారు. ఎస్ఎస్‌పీ ద్వారా రూ.507 కోట్లతో 19 పనులు మంజూరు కాగా, 12 పనులు వివిధ దశల్లో జరుగుతుండగా, మరో 6 పనులు టెండరు దశలో ఉన్నాయని తెలిపారు. రాయలసీమ డ్రాట్ మిటిగేషన్ ప్రోగ్రాం ద్వారా రూ. 2,144 కోట్లతో ఆవులపల్లె, నేతిగుంట పల్లె , ముదివేడు వద్ద మూడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను నిర్మించి పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా పశ్చిమ మండలాలకు గండికోట నీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కుప్పం నియోజకవర్గం పరిధిలో వరదలవల్ల దెబ్బతిన్న చెరువులు, కుంటల మరమ్మత్తులకు రూ. 6.31 కోట్లతో అంచనాలను, కొండిన్య నదిపై 11 చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి రూ.23 కోట్ల అంచనాలను ప్రతిపాదించి ప్రభుత్వానికి పంపినట్లు వివరించారు.

జగనన్నకు చెబుదాంపై తక్షణం స్పందించాలి



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శ్రీనివాసులు

రామకుప్పం: జగనన్నకు చెబుదాంకు వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని ప్రజల సమస్యలను తెలుసుకుని, అర్జీల రూపంలో వినతులను జేసీ స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రాల్లో ప్రతి బుధ, శుక్రవారం జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా, మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై 15 రోజుల తర్వాత సమీక్ష ఉంటుందని తెలిపారు. అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. అసైన్‌మెంట్ భూముల్లో సాగు చేసుకుంటున్న రైతుల జాబితాను ఆర్డీఓకు పంపాలని తహసీల్దార్ మురళిని ఆదేశించారు. మండల పరిధిలో ఎస్సీ,ఎస్టీ గ్రామాల్లో శ్మశాన వాటికల ఏర్పాటుకు ప్రభుత్వ భూములను పరిశీలించాలన్నారు. అవసరమైతే ప్రైవేటు భూములను పరిశీలించి కలెక్టర్ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 206 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కుప్పం ఆర్డీఓ శివయ్య, డీఆర్‌డీఏ పీడీ తులసీ, డీపీఓ లక్ష్మి, డీసీఓ బ్రహ్మానందం రెడ్డి, డీఎల్‌పీఓ రవికుమార్, ఎంపీడీఓ శివశంకర్, ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, కో–కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, మండల కోఆప్షన్ సభ్యుడు బరకతుల్లా పాల్గొన్నారు.

దారికాచిన మృత్యువు

మొదలే అనారోగ్య సమస్యలు. పెనిమిటి ప్రాణం నిలుపుకోవాలని ఆ ఇల్లాలు బంధువులను వెంటబెట్టుకుని రాష్ట్రంగాని రాష్ట్రం వచ్చింది. అక్కడా సమస్యలు వెంటాడడంతో తిరిగి సొంత రాష్ట్రానికి వెళ్లాలని నిశ్చయించుకుంది. కన్నీళ్లు దిగమింగుకుని .. కడుపునిండా బాధలు నింపుకుని అంబులెన్స్ ఎక్కింది. కొంత దూరం వెళ్లగానే దారికాచిన మృత్యువు ట్యాంకర్ రూపంలో వెంటాడింది. అనారోగ్యంతో బాధపడుతున్న భర్తతో సహా ఐదుగురి ప్రాణాలను బలితీసుకుంది. పొద్దుపొడవక ముందే జరిగిన ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.

- ఆగి ఉన్న ట్యాంకర్‌ను ఢీకొన్న అంబులెన్స్
- ఒడిశాకు చెందిన ఐదుగురు దుర్మరణం
- తవణంపల్లె మండలంలో వేకువజామున ఘటన
- డ్రైవర్ కునుకుతోనే ప్రమాదం?



మృతుల వివరాల కోసం ఒడిశాకు ఫోన్ చేస్తున్న చిత్తూరు సీఐ రవిశంకర్ రెడ్డి

తవణంపల్లె: మండలంలోని తెల్లగుండ్లపల్లె సమీపంలో ఆగి ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను అంబులెన్స్ వేగంగా ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడ్డారు. పోలీసుల కథనం.. ఒడిశా రాష్ట్రం కేంద్రపారకు చెందిన ఉమేష్‌చంద్ర సాహు(46) యూరిన్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం భార్య రష్మితసాహు(45), మామ త్రిలోచాన్‌నాయక్(63), సమీప బంధువు బిజయ్‌నాయక్(56)తో కలిసి గురువారం ఒడిశా నుంచి ప్రైవేటు అంబులెన్స్‌లో బెంగళూరులోని ఒక హాస్పిటల్‌కు చేరుకున్నారు. అక్కడ సరైన వసతులు లేకపోవడంతో తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. శుక్రవారం వేకువ జామున సుమారు 4.15 గంటల సమయంలో మండలంలోని తెల్లగుండ్లపల్లె సమీపంలో ఆగి ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను అంబులెన్స్ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉమేష్‌చంద్రసాహు, భార్య రష్మితసాహు, త్రిలోచాన్‌నాయక్, బిజయ్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందారు. అంబులెన్స్ డ్రైవర్లు జాటిన్‌కుమార్ సాహుల్(30) చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందారు. సంజయ్‌కుమార్ జేనా(30), సహాయకుడు దేబబ్రత దాస్(24) స్వల్పంగా గాయపడ్డారు. అంబులెన్స్ డ్రైవర్ కునుకుపాటే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు.

ఆధార్ కార్డుల ఆధారంగా గుర్తింపు

సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి స్థలానికి చేరుకున్నారు. అంబులెన్స్‌లో ఇరుక్కుపోయిన మృతదేహాలను జేసీబీ సాయంతో బయటకు తీశారు. లభించిన ఆధార్ కార్డుల ఆధారంగా వారు ఒడిశాకు చెందిన వారుగా గుర్తించారు. వారి బంధువుల ఫోన్ నంబర్లకు సమాచారం అందించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం, మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆయిల్ ట్యాంకర్‌ను స్టేషన్‌కు తరలించి, డ్రైవర్ శంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ, సీఐ

రోడ్డు ప్రమాద సంఘటన స్థలాన్ని చిత్తూరు డీఎస్పీ శ్రీనివాస మూర్తి, చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, యాదమరి ఎస్ఐ సుమన్ పరిశీలించారు. ప్రమాద జరిగిన తీరుపై ఆరా తీశారు. హైవేలో రాత్రి సమయంలో లారీలను పార్కింగ్ చేయకుండా చూడాలని పోలీసులకు సూచనలు ఇచ్చారు.

ఆగి ఉన్న వాహనంతోనే ప్రమాదం

తవణంపల్లె మండలంలోని తిరుపతి–బెంగళూరు జాతీయ రహదారి పట్నం వద్ద ఆరు నెలల కిందట బెంగుళూరు నుంచి స్వగ్రామం గుంటూరుకు వెళ్తున్న కుటుంబం కారు వేకువజామున ఆగిఉన్న పాల ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో భార్య, భర్త, కుమారుడు ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. తల్లి ఒడిలో మూడు సంవత్సరాల కుమారుడు చనిపోవడం పలువురిని కలిచి వేసింది. శుక్రవారం జరిగిన ప్రమాదం గతంలో పట్నం వద్ద జరిగిన ప్రమాదానికి మూడు కిలో మీటర్ల దూరంలో మాత్రమే ఉంది. జాతీయ రహదారిలో లారీలు, ట్యాంకర్లను రోడ్డు పక్కన ఎక్కడ పడితే అక్కడ ఆపేయడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారి ఆరులైన్లు కావడంతో కార్లు వేగంగా వెళ్తుంటాయి. కాని రోడ్డు పక్కన చీకట్లో ఆపి ఉన్న వాహనాలను వేగంగా వెళ్లే వాహనాల డ్రైవర్లు గుర్తించక పోతుండడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై పోలీసులు తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఎమ్మెల్యే సంతాపం

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందడంపై పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. బయట రాష్ట్రం వారు కాబట్టి వారికి తగు సహాయక చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.



ఉమేష్‌చంద్రసాహు



రష్మితసాహు



త్రిలోఛాన్‌నాయక్



బిజయ్‌నాయక్

కానిస్టేబుల్‌కు చేయూత



రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎస్పీ రిశాంత్‌రెడ్డి

తిరుపతి మంగళం: ఇటీవల పుంగనూరులో టీడీపీ నాయకులు, కార్యకర్తల దాడిలో కన్ను కోల్పోయిన కానిస్టేబుల్ రణధీర్‌కు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండగా నిలిచారు. ఆయన శుక్రవారం చిత్తూరు ఎస్పీ రిశాంత్‌రెడ్డితో కలిసి తిరుపతి మారుతీనగర్‌లోని తన నివాసంలో కానిస్టేబుల్ రణధీర్‌తో పాటు కుటుంబ సభ్యులకు భాస్కర్‌రెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.5 లక్షల చెక్కు అందజేశారు. ప్రజలకు రక్షణ కల్పించే పోలీసులకే టీడీపీ దౌర్జన్యకారుల నుంచి రక్షణ లేకుండా పోయిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుల అరాచకాలు, ఆగడాలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

ఇద్దరు బీఎల్ విద్యార్థుల డిబార్

ఏర్పేడు : అంజిమేడు ఈశ్వర్‌రెడ్డి న్యాయ కళాశాలలో ఫోర్త్ సెమిస్టర్ టాక్సేషన్ పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను శుక్రవారం డిబార్ చేశారు. తహసీల్దార్ శివప్రసాద్ తనిఖీల్లో ఇద్దరు పట్టుబడ్డారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు



సుపథ మండపంలో విద్యుత్ లైట్ల ఏర్పాటు

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలకు దేవస్థానం ఏర్పాట్లను వేగవంత చేసింది. ఈనెల 18వ తేదీ చవితి రోజు నుంచి 21 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. శుక్రవారం అదనపు క్యూలు, విద్యుద్దీపాలంకరణ, హోమ గుండాల పనులను ముమ్మరం చేశారు. శనివారం సాయంత్రం నాటికి ఏర్పాట్లు పూర్తి కానున్నట్లు దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు.

-కాణిపాకం(యాదమరి)



హోమగుండాల వద్ద అలంకరణ పనులు



అదనపు క్యూలకు ఏర్పాట్లు

క్లుప్తంగా

టీడీపీ కార్యకర్తకు దివ్యాంగ పింఛన్



సదుం: పింఛన్ అందుకుంటున్న దామోదర

సదుం: మండలంలోని జోగివారిపల్లె పంచాయతీ కంభంవారిపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త దామోదర దివ్యాంగ పింఛన్ మంజూరైంది. ఆయన కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్నారు. ఆయనకు పింఛన్ మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. సచివాలయం ద్వారా వారు దరఖాస్తు చేయించడంతో రూ.3వేల పింఛన్ మంజూరైంది. శుక్రవారం జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి సచివాలయ సిబ్బందితో కలిసి ఆయనకు పింఛన్‌ను అందించారు. ఈసందర్భంగా ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే తమ కుటుంబం మద్దతు పలుకుతుందని చెప్పారు.

యువతి ఆచూకీ లభ్యం

సోమల: మిస్సింగ్ కేసులో యువతి ఆచూకీ గుర్తించినట్లు ఎస్‌ఐ వెంకట నరసింహులు శుక్రవారం తెలిపారు.వివరాలు మండలం లోని అన్నెమ్మగారిపల్లె పంచాయతీ బోనమందకు చెందిన యువతి తనను తల్లిదండ్రులు చదువు ఆపేసి వివాహ సంబంధాలు చూస్తున్నారని ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గత నెల 28వ తేదీన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గంగవరం మండలం గొర్రెలదొడ్డి గ్రామంలోని చిన్నాన్న ఇంట్లో యువతి ఉన్నట్లు సమాచారం అందింది. పోలీసులు అక్కడి వెళ్లి ఆ యువతిని తీసుకు వచ్చి తహసీల్దార్ మాధవరాజు ఎదుట హాజరు పరిచి, తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయం

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- జ్యోతిరావు పూలే భవనం ప్రారంభం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద రూ.4.43 కోట్లతో నిర్మించిన మహాత్మ జ్యోతిరావుపూలే భవనాన్ని మంత్రులు ప్రారంభించారు. తొలుత జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులు అర్పించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల అభివృద్ధికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమ ప్రభుత్వ పాలనలో అమలవుతున్నాయని చెప్పారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ప్రధాన రహదారికి పక్కనే నిర్మించిన పూలే భవనం ప్రజలందరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు, ఎంఎల్‌సీ భరత్, నగర మేయర్ అముద, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, ఈడిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శాంతి, డీసీసీబీ చైర్మన్ రెడ్డెమ్మ, చుడా చైర్మన్ పురుషోత్తం, ఏపీ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కట్టమంచి ధీరజ్‌రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జోనల్ చైర్‌పర్సన్ శైలజా రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ రెడ్డి, డీఆర్‌వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, బీసీ వెల్ఫేర్ డీడీ రబ్బానిబాషా, ఆర్డీవో రేణుక, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీకి శిబిరాలు



మాట్లాడుతున్న ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచితంగా ఉపకరణాల పంపిణీకి వైద్య నిర్ధారణ శిబిరాలు నిర్వహించనున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలల్లో ఒకటి నుంచి 12 వ తరగతి వరకు చదువుతున్న ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ముందుగా జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 9 కేంద్రాల్లో ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు వైద్యనిర్ధారణ శిబిరాలు జరుగుతాయని తెలిపారు. ఈ నెల 20న వి.కోట, 21న కుప్పం, 23న పుంగనూరులో, 24న సదుంలో, 25న జీడీనెల్లూరులో, 26న వెదురుకుప్పం మండలం పచ్చికాపలంలో, 27న నగరి, 29న పలమనేరులో, 30న చిత్తూరులో శిబిరాలు జరుగుతాయని వివరించారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కోఆర్డినేటర్ల నియామకం



భరత్‌కుమార్‌రెడ్డి



దినేష్

చిత్తూరు కార్పొరేషన్: జగనన్న సచివాలయ చిత్తూరు జిల్లా కన్వీనర్ల కోఆర్డినేటర్లను పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మే రకు నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు ని యోజకవర్గానికి చెందిన భరత్‌కుమార్‌రెడ్డి, పూతలపట్టు నియోజకవర్గం తవణంపల్లె మండలానికి చెందిన దినేష్‌ను జిల్లా కోఆర్డినేటర్లగా నియమించారు.

22న జిల్లా స్థాయి సైన్స్ సెమినార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా స్థాయిలో ఈనెల 22న నగరంలోని పీసీఆర్ పాఠశాలలో నిర్వహించే సైన్స్ సెమినార్‌లో విద్యార్థులు పాల్గొనాలని డీఈవో విజయేంద్రరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిరుధాన్యాలు ఒక మంచి పోషకాహారం, ఒక మంచి ఆహారం అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8,9,10 తరగతులు చదివే విద్యార్థులు అర్హులన్నారు. ఒక పాఠశాల నుంచి ఒక విద్యార్థి మాత్రమే పాల్గొనాలని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వెంకటరమణను 9701871545 నంబర్‌లో సంప్రదించవచ్చని డీఈవో తెలిపారు.

సులభంగా అర్థమయ్యేలా బోధన సాగాలి



విద్యార్థులను ప్రశ్నిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

రామకుప్పం: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన సాగాలని జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు సూచించారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థులను పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి, వారి సమాధానలపై సంతృప్తి వ్యక్తం చేశారు. సబ్జెక్టుల వారీగా సిలబస్ ఎంతవరకు పూర్తయిందని ఉపాధ్యాయులను ఆరా తీశారు. ఎంఈఓ-2 నారాయణ, ప్రధానోపాధ్యాయురాలు సుజాత పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితురాలి అరెస్టు చూపుతున్న సీఐ సీతారామిరెడ్డి

సోమల: మండలంలోని ఇరికిపెంట వడ్డిపల్లెలో శుక్రవారం 768 టెట్రా ప్యాకెట్ల (బెంగళూరు విస్కీ) కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఓ మహిళను అరెస్ట్ చేశారు. పుంగనూరు ఎస్ఈబీ సీఐ సీతారామిరెడ్డి కథనం మేరకు..ఇరికిపెంట వడ్డిపల్లెలో మంజుల అనే మహిళ కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. సదరు మహిళను అరెస్ట్ చేసి, ఇంటిలో దాచి ఉంచిన 768 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మద్యం విలువ రూ.25 వేలు ఉంటుందని సీఐ తెలిపారు. ఎస్ఐ అశోక్ కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

శిశు మరణాలను తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఓ రవిరాజు

చిత్తూరు రూరల్: జిల్లాలో శిశుమరణాలను తగ్గించేందుకు వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో బాధ్యతగా పనిచేయాలని డీఐఓ రవిరాజు అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం శిశుమరణాలపై వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో హైరిస్క్ గర్భిణులను గుర్తించాలన్నారు. వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని తెలిపారు. శిశుమరణాలు జరగకుండా ముందస్తు వైద్య సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో పద్మజారాణి, లత, ఉషశ్రీ, మీనాకుమారి, రేణుకప్రభ, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ధర్నాకు మద్దతు కరువు

రొంపిచెర్ల: ప్రజల దృష్టిని మరల్చేందుకు పుంగనూరు ఘటనలో అరెస్టు అయిన వారిని విడుదల చేయాలని ధర్నాకు ప్రయత్నించిన టీడీపీ నేతలకు మద్దతు కరువైంది. శుక్రవారం టీడీపీ మండల ఇన్‌చార్జి ఊయల రమణ, పుంగనూరు ఇన్‌చార్జి చల్లా బాబు సుప్రియారెడ్డి, తల్లి ప్రేమలతమ్మ రొంపిచెర్ల క్రాస్ రోడ్డు వద్దకు ర్యాలీగా బయలు దేరారు. స్వల్పంగా వచ్చిన కార్యకర్తలు ఓవర్ యాక్షన్ చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని ధర్నాలకు, నిరసనలకు అనుమతి లేదని, అలా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో రోడ్డు పక్కనే విలేకరుల సమావేశం పెట్టి వారు వెనుదిరిగారు.



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,450

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,000
రిటైల్ వెండి గ్రాము	రూ.75.00

రెజ్లింగ్ అండర్-14 జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన బాల,బాలికల జట్లు

పుత్తూరు రూరల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా రెజ్లింగ్ అండర్-14 బాల,బాలికల జట్ల ఎంపిక పోటీలు శుక్రవారం వడమాలపేట జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగాయి. పాఠశాల హెచ్‌ఎం కరుణా నవనీతం పోటీలను ప్రారంభించారు. స్కూల్ గేమ్స్ సెక్రెటరీలు విజయకుమారి, బాబు, సరేష్‌బాబు, రెజ్లింగ్ కార్యదర్శి సరేంద్రరెడ్డి, కోచ్ సాయిసుమతి పర్యవేక్షణలో పీడీలు ప్రసన్నకుమారి, పుష్పవాణి, త్రిలోకసుందరి, హరికృష్ణ జట్లను ఎంపిక చేశారు.

బాలికల జట్టు : అంజలి 36 కిలోలు, మానస 58 (వడమాలపేట), శ్రావణి 30, భార్గవి 33, రమ 39, వర్షిత 42, ఉషశ్రీ 46(రేణిగుంట), జేసితశ్రీ 50, జీవన 54(యాదమరి), సాయివాణి 62 కిలోలు (తిరుపతి)

బాలుర జట్టు :

అసన్ 35 కిలోలు, కార్తీక్ 48(పూడి), శ్రావణ్‌కుమార్ 75(వడమాలపేట), నాగరాజు 38, సంగారెడ్డి 57, మోహనాచారి 62(పల్లం), ప్రిన్స్ 41, రేశ్వంత్‌కుమార్ 52(తిరుమలయ్యపల్లె), మణికంఠ 44(తిరుపతి), సైపుల్ల 68 కిలోలు(యాదమరి)

ఘనంగా ఇంజినీర్స్ డే



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి



పాల్గొన్న ఇంజినీరింగ్ సహాయకులు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని రెవెన్యూ భవన్‌లో శుక్రవారం ఇంజినీర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులతో నిర్వహించిన సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంజినీర్ల ఆలోచనలే కట్టడాలకు పునాదని తెలిపారు. తొలుత మోక్షగుండ విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ క్లినిక్ తదితర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణంలో ఇంజినీరింగ్ సహాయకుల పాత్ర వెలలెక్కకట్టలేనిదన్నారు. ప్లాన్ ప్రకారం భవనాలను నిర్మిస్తే భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు రావన్నారు. కార్యక్రమంలో ఈఈలు రమణయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలోని మోక్షగుండ విశ్వేశ్వరయ్య విగ్రహానికి చిత్తూరు ఆర్కిటెక్స్ సివిల్ ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు జయప్రకాష్, శ్రీనివాసబాలాజీ, విజయశేఖర్, గుణశేఖర్, జ్యోతిశ్వరన్, ఆర్‌అండ్‌బీ అధికారులు పుష్పాంజలి ఘటించారు. ట్రాన్స్‌కో రూరల్ ఈఈ కార్యాలయంలో ఇంజినీర్స్ డే ను పురస్కరించుకొని ఎస్ఈ కృష్ణారెడ్డిని ఈఈ, డీఈ, ఏఈలు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

విద్యుత్ అంతరాయం తగ్గించండి



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సరఫరాలో అంతరాయం తగ్గించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. రూరల్ ఈఈ కార్యాలయంలో శుక్రవారం చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్లు, జిల్లా స్టోర్స్, ఎస్‌పీఎం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోడ్ ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో ట్రీ కటింగ్ నిర్వహించాలన్నారు. అవసరమైన చోట అదనపు సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి నెలా వందశాతం విద్యుత్ బిల్లుల వసూలుకు కృషి చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు పాడైతే రెండు రోజుల్లో మార్పు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈలు హరి, పద్మనాభపిళ్లై, డీఈఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, జయప్రకాష్, ఆనంద్ పాల్గొన్నారు.

సనాతన ధర్మంపై జిల్లాలో ప్రచారం



జిల్లాలో పర్యటించనున్న వరసిద్ధి వినాయక స్వామి ధర్మప్రచార రథం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ధర్మప్రచార రథంలో మారుమూల గ్రామాల్లో సనాతన ధర్మంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. 13 మంది సభ్యులు పర్యటించనున్న స్వామివారి ధర్మప్రచార రథాన్ని పర్యాటక మంత్రి ఆర్కే రోజా శుక్రవారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాలో 31 మండలాల్లోని ధర్మప్రచార రథం సాగుతుందన్నారు. స్వామివారి ధర్మ ప్రచార రథం జిల్లాలోని ప్రతి మండలానికి వస్తుందని, గ్రామీణ ప్రజలు స్వామివారిని దర్శించుకోవాలన్నారు. అలాగే ఆల య విశిష్టతపై భజనలు, చెక్కభజనలు, ప్రవచనాలు, భక్తి గీతాలు ఆలపిస్తారని, గ్రామాలలో ఉన్న కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం.. నలుగురిపై పీడీ యాక్టు

- కడప కారాగారానికి తరలింపు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో నిత్యం శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్న నలుగురు రౌడీషీటర్లపై (ప్రివెంటివ్ డిటెన్షన్) యాక్టును ప్రయోగిస్తూ కలెక్టర్ షణ్మోహన్ నిర్ణయం తీసుకున్నారు. చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి ప్రతిపాదనలను కలెక్టర్ ఆమోదించడంతో నిందితులు ఎం.శరవణ (38), ఎంజీ.ఆనంద్‌బాబు (34), కె.సాయిరామ్ (25), కలికిరి సురేష్‌కుమార్ (37)పై పీడీ యాక్టు ప్రయోగించి శుక్రవారం వైఎస్సార్ కడప కేంద్ర కారాగారానికి తరలించారు. సామాన్యులకు ఇబ్బందులు కలిగించేలా ప్రవర్తిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా వదిలేదిలేదని ఎస్పీ స్పష్టం చేశారు. చిత్తూరు టూటౌన్ సీఐ మద్దయ్య ఆచారి, ఎస్ఐ నాగరాజు వివరాలను మీడియాకు నిందితుల వివరాలను వెల్లడించారు.



శరవణ : కరుడుగట్టిన మనస్తత్వం కలిగిన శరవణ చిత్తూరు నగరంలోని కట్టెలదొడ్డిలో నివాసముంటున్నాడు. ఇతను తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక కార్యకర్త. టీడీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తి నానికి ఇతను అంగరక్షకుడిగా ఉండేవాడు. ఇతను తన కుటుంబ సభ్యులతో కలిసి తన ఇంటి పక్కనున్న గోవిందస్వామి కుటుంబ సభ్యులపై పాతకక్షల కారణంతో పలుమార్లు దాడి చేసి, హత్య ప్రయత్నాలు చేశాడు. తరచుగా అల్లర్లకు పాలపడుతూ ఉన్నాడు. 2008వ సంవత్సరం నుంచి ఇతడిపై చిత్తూరు వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 12 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఇతను తనకుటుంబ సభ్యులతో కలిసి కట్టెలదొడ్డి, చిత్తూరు నగరంలో దౌర్జన్యాలు చేస్తూ, చుట్టూ ప్రక్కల వారిపై గొడవలకు వెళ్లడం, వారిపై దాడి చేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడు. నిందితుడిపై చిత్తూరు టూటౌన్ స్టేషన్‌లో రౌడీషీట్ కూడా ఉంది.



ఆనంద్‌బాబు : చిత్తూరులోని మిట్టూరుకు చెందిన ఇతను రామ్ నగర్ కాలనీలో జ్యోత్స్న అనే యువతిని పెళ్లి చేసుకొని, ఆమెను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసేవాడు. కాపురానికి రాలేదని చర్చివీధిలో దుకాణం నిర్వహిస్తున్న యువతి సోదరుడు మణికంఠ, ప్రదీప్, సిబ్బందిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. పలుమార్లు వీధిలో నిలబడి అసభ్యకరంగా మాట్లాడడం, సామాన్యులకు ఇబ్బందులకు చేసేవాడు. జ్యోత్స్న తల్లి మంజుల, వారి కుటుంబ సభ్యులను చంపాలనే ఉద్దేశంతో ఆనంద్‌బాబు, ఇతని అనుచరులు సాయిరామ్, రవికుమార్‌తో కలిసి ఇంట్లో పెట్రోలు బాంబు పేల్చి భయభ్రాంతులకు గురిచేశాడు. 14 కేసుల్లో ఆనంద్‌బాబు నిందితుడుగా ఉన్నాడు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇతనిపై రౌడీషీట్ కూడా ఉంది.



సాయిరామ్ : చిత్తూరు నగరంలోని ఎంజీఆర్ వీధికి చెందిన ఇతను సామాన్య ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తూ భౌతిక దాడులు, హత్యాయత్నం ఘటనల్లో పాల్గొనేవాడు. సంఘవిద్రోహశక్తిగా మారిన ఆనంద్‌బాబుతో కలిసి హింసాత్మక ఘటనల్లో పాల్గొనేవాడు. చిత్తూరు పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ఇతనిపై ఆరు కేసులు ఉన్నాయి. టూటౌన్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది.



సురేష్‌కుమార్ : యాదమరి మండలం మాదిరెడ్డిపల్లెకు చెందిన ఇతను గ్రామంలో నిత్యం అల్లర్లకు, గొడవల్లో పాల్గొంటూ క్రూరత్వాన్ని ప్రదర్శించేవాడు. 2020వ సంవత్సరంలో గ్రామంలో ప్రజలను భయాందోళనకు గురిచేసే సమయంలో.. పోలీసులు వెళ్లగా వారిపై దాడి చేసి పలువురు పోలీసులను గాయపరిచాడు. ఇతనిపై యాదమరితో పాటు తిరుపతి, తిరుచానూరు ఇతర పోలీస్ స్టేషన్లలో 13 క్రిమినల్ కేసులు ఉన్నాయి. నిందితుడు తన చుట్టుపక్కల గ్రామాల్లో దౌర్జన్యాలు, గొడవలు, దాడులు చేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడు. ఇతనిపై యాదమరి పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ తెరచారు.